# ఖమ్మంజిల్లా గిరిజనుల సంస్కృతి-ప్రగతికి సవాళ్ళు

మధ్యభారతంలో గోండులుగా, కోయలుగా ఇంకా రకరకాలపేర్లతో పిలువబడే తెగలో ఒకభాగం వరంగల్, ఖమ్మం, తూర్పు, పశ్చిమగోదావరిజిల్లాల్లో విస్తరించింది. ఆంధ్రుల అయోధ్య భద్రాచలం; ఆంధ్రుల మొదటిసామ్రాజ్యం కాకతీయుల రాజధాని ఓరుగల్లు; ఆ సామ్రాజ్యాన్ని తిరిగి నిలబెట్టిన 'జీర్ణకాకతీయస్థాపనాచార్యుడు' పన్నెండువేల విలుకాండ్లదళానికి అధిపతి కోయవీరుడు సీతాపతిరాజు/షితాబ్‌ఖాన్, తెలంగాణా ఆరాధ్యదేవతలు సమ్మక్క సారక్క! ఇవన్నీ కోయలు వ్యాపించిన వరంగల్, ఖమ్మంజిల్లాల ప్రత్యేకతలు. కోయలు, తలపాగాలలో ధరించే కొమ్ములుగల గౌరగేదెల (అడవిదున్నలు) అభయారణ్యాలు ఏటూరునాగారం, పాపికొండలు; ఈప్రాంతంలోవే.

ఖమ్మంజిల్లాలోని భద్రాచలం, శ్రీరామగిరి, పర్ణశాల, ఏటపాక (జటాయువుకు రాముడు అంతిమసంస్కారంచేసినచోటు), సీతావియోగంతో రాముడు శోకించిన సోకులేరు. సీతారాములకు ఆతిథ్యమిచ్చి నదిగా మారిన శబరి, ఆయన వనవాసంగడిపిన ఈ దండకారణ్యంలో ఇలా అడుగడుగునా కోయలు చెప్పుకునే గాథలమధ్య కొలువైన దేవుడు - రాముడు.

రాముడికి భద్రాచలంలో కోయలకిష్టమైన ఇప్పపూలు నివేదిస్తే - శ్రీరామగిరిలో సుందరరాముడికి, గిరిజనవివాహపద్ధతుల కనుగుణంగా 'దొంగలదోపు' (పెళ్ళికూతురును దొంగిలించడం) జరిపిస్తారు. రాముడి పెళ్ళిజరిగే ముహూర్తం, మిట్టమధ్యాహ్నం - ఈనాటికీ గిరిజనుల పెళ్ళి ముహూర్తమే. ఆ 'దేవుడిపెళ్ళి' తరువాతనే ఈ ప్రాంతమంతా పెళ్ళిళ్ళు జరుపుకుంటారు. రాముడికి తొలిగా గుడినిర్మించి సేవించిన పోకల దమ్మక్క, శబరి అవతారంగా చెప్పుకుంటారు. ఇలా - రాముడితో పెనవేసుకుపోయిన ఈభూమిలో, తమ సంప్రదాయాలు వదలి - ఇతరమతాలలోకి మళ్ళుతున్నవారిసంఖ్య కూడా క్రమంగా పెరుగుతుంది.

ఈజిల్లాలో అత్యధికప్రాంతం గిరిజనప్రాంతంగా గుర్తింపుపొందింది. ఈప్రాంతంలోని కొండప్రాంతాలలో నివసించే కొండరెడ్లు-తెలుగు సంస్కృతికి పునాదిశిలలు. రేకపల్లిలో కోండ్ల భీమిరెడ్డి రంపపితూరీ (1850) బావుటా ఎగరేశాడు. పేరంటపల్లి స్వామి బాలానంద, కొండరెడ్డి-కోయపిల్లలను రాజమండ్రిలో చదివించారు. వారిలో మొదటితరం ప్రజాప్రతినిధులు అలా చదువుకున్నవారే. నాయకపోడులు కొద్దిసంఖ్యలో, లంబాడీలు అధికసంఖ్యలో ఉన్నారు.

సింగరేణి బొగ్గుగనులు, మణుగూరు భారజలకర్మాగారం, సారపాకలో పేపర్‌మిల్లు, పాల్వంచలో వివిధ కర్మాగారాలు ఇలా ఎన్నో పరిశ్రమలు ఏర్పడినా, నిర్వాసితులైన గిరిజనులకు దక్కిన ఉపాధి నామమాత్రమే. అంతేకాదు పెరిగిపోతున్న వలసలు, పరిశ్రమల ప్రభావంవల్ల అడవులు గుల్లఅయినాయి. వెదురునరుకుపనిలో ఉపాధిపొందిన లక్షలాది గిరిజనులకు ఇవాళ అడవిలో పనేలేదు. అన్నివిధాల వనవాసులను నష్టపరచిన ఈ పరిణామాలు చాలవన్నట్లు - పోలవరం ప్రాజెక్టుముంపుకు గురయ్యే అధికభాగం ఈ ప్రాంతంలోదే. ఈప్రాంతంలో - గిరిజనులలో, మిగిలిఉన్న అందాలను పెరిగిపోతున్న పర్యాటకరంగం బలితీసుకుంటుంది.

అత్యధికభూభాగం గిరిజనప్రాంతమైనా, సగటు గిరిజనుడు భూమిలేని నిరుపేదే. ఆదర్శదంపతులు సీతారాములు నడయాడిన ఈ పుణ్యభూమిలో మోసపోయిన గిరిజనమహిళలసంఖ్య ఎక్కువే. గిరిజనుడికి ఉపాధినిచ్చే చదువులేదు. నిర్వాసితులై, వనరులు కోల్పోయి, ఇక్కడి గిరిజనులు మగ్గుతుంటే, శాంతిభద్రతలు లోపించి, పొరుగురాష్ట్రంనుండి వస్తున్న వలసలు - కనీసవసతులు లేని వారి దీనస్థితి మరింత హృదయవిదారకంగా ఉంది. ఇలా ప్రభుత్వం-గిరిజనులు; గిరిజనులు-గిరిజనులు; గిరిజనులు-ఇతరులమధ్య సంబంధాలలో పెరుగుతున్న ఉద్రిక్తత నివురుగప్పిన నిప్పులా భగ్గుమంటుంది. గిరిజనులు ఉద్యమించినపుడల్లా - ఇతరుల సంగతేమిటంటు మోకాలడ్డే రాజకీయనాయకులకు కొదవలేదు.

1/70 రెగ్యులేషన్, అటవీహక్కులచట్టాలు-కొంతమందినే ఆదుకున్నాయి. ఉద్యోగాలు, చదువులకోసం ఆశపడే గిరిజనులమధ్య కూడా స్థానిక-స్థానికేతర భేదాలు పెరిగిపోయాయి. ఉద్యోగులు, నాయకులు ఒక వర్గంగా ఎదుగుతున్న తమ తెగల సమస్యలను

చాటేవారు పెరగలేదు. సగటు గిరిజనులు దళారీలమీదనే ఆధారపడిఉన్నారు. కాబట్టి గిరిజనులలో స్థానికసమస్యలు పరిష్కరించాలనే నాయకత్వం, ఉపాధిఅవకాశాలుగల విద్యార్థి తమ వారసత్వంపట్ల విశ్వాసంపెంచే ప్రయత్నం అవసరం.

వివేకానందుడు గిరిజనులవలె ఆత్మవిశ్వాసంకోల్పోతున్న వారిని దరిద్రనారాయణులుగా వర్ణించారు. వారు మనవల్ల దరిద్రులైనారు. ఇప్పుడైనా మనం వారిపట్ల అవగాహన పెంచుకోవాలి. వారి అభివృద్ధికోసం కృషిచేయాలి. స్వామి వివేకానందుని 150వ జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్న ఈ సంవత్సరంలో ఆయన బోధనలు స్ఫూర్తిగా మనం గిరిజనులలో కార్యక్రమాలను చేపట్టడం అవసరం.

**స్థానిక విశ్వాసాలను పాటించండి స్థానీయ సంస్కృతులను ప్రోత్సహించండి**
**దేశీయ వ్యక్తిత్వాన్ని కాపాడండి - స్వామి వివేకానంద**